

ఎస్పీ కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌మీనా, అదనపు ఎస్పీ ప్రసాద్

కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం పెంచాలి

జూమ్ కాన్ఫరెన్సులో జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా ఆదేశం

అమలాపురం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం ప్రాధాన్యతగా ప్రతీ కేసు దశలవారీగా పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జూమ్ కాన్ఫరెన్సు ద్వారా నేర సమీక్ష నిర్వహించిన ఎస్పీ మీనా కేసులు పెండింగ్‌నకు గల కారణాలు, ముద్దాయిల అరెస్టు, నాన్ బెయిలబుల్ వారెంట్ అమలు, కేసుల దర్యాప్తు తదితర అంశాలపై ఎస్పీ కార్యాలయంలో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో భౌతిక ఆధారాల సాధన, కీలకమైన దశ అని, ప్రతీ పోలీసు అధికారి వృత్తి పరమైన నిబద్ధతతో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, దర్యాప్తులో నాణ్యత, తక్షణ స్పందన, సాక్షాధారుల సేకరణలో ఖచ్చితత్వం ముఖ్యమన్నారు.శాస్త్రీయంగా సాక్ష్యాధారాలు సేకరించి చార్జిషీటు నిర్దిత సమయానికి దాఖలు చేయాలని సూచించారు. కోర్టులో సరైన ఆధారాలతో దర్యాప్తు పత్రాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి వెంటనే విచారణ చేపట్టాలని, ప్రతీ అధికారి తన పరిధిలో పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రాధాన్యతా కేసులు త్వరితగతిన విచారణకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్పీ కోరారు. క్రైమ్ ఎగెనెస్ట్ ఉమెన్ కేసుల్లో సమగ్రంగా దర్యాప్తుచేసి బాధితులకు న్యాయంచేసి దోషులకు శిక్ష పడేలా చూడాలన్నారు. రాత్రివేళల్లో పకడ్బందీగా విధులు నిర్వహించి అనుమానిత వ్యక్తులు తారసపడితే వివరాలు సేకరించాలని ఎస్పీ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రోపర్టీ నేరాలపై దృష్టి సారించి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసులను ఛేదించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలతో మమేకం కావాలని, పాత నేరస్తుల కదలికలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కాన్ఫరెన్సులో అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీలు సుంకర మురళీకృష్ణ, ప్రసాద్, రఘువీర్, ఎస్బీ సీఐ పుల్లారావు, డీసీఆర్బీ సీఐ మురళీకృష్ణ, సోషల్‌మీడియా సీఐ తమ్మినాయుడు, సూపరింటెండెంట్ రాఘవ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

పోలీసుల అదుపులో నిందితుడు

పోక్సో కేసు నమోదు

పోలీసుల విచారణలో మరో అఘాయిత్యం వెలుగులోకి..

జిల్లాలో ఘటన

అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలో జరిగిన ఘోరం ఇది. ఇక్కడ చదువుకునే ఓ బాలికపై ఒక కామాంధుడు పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందడంతో విచారణ ప్రారంభించిన పోలీసులకు మరో బాలికపైనా ఇతడు అఘాయిత్యానికి పాల్పడినట్టు తేలడంతో విస్తుపోవడం వారి వంతైంది. ఐ.పోలవరం మండలం ఓ గ్రామానికి చెందిన రాయపురెడ్డి సత్య వెంకటకృష్ణ (బాబి)పై ఓ బాలిక తల్లి గురువారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకోవడంతోపాటు పోక్సో చట్టం కింద ఐ.పోలవరం ఎస్ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేశారు. కాగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే బుచ్చిబాబు చెప్పారు. ఆయన స్వయంగా బాధిత బాలిక, కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. జరిగిన సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాగా ఈ ఘటనలో నిందితుడు మీ పార్టీ వాడంటే, మీ పార్టీ వాడంటూ వైసీపీ, జనసేనలకు చెందిన నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు దిగారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. - మెయిన్‌లో..



అమలాపురంలో నాన్‌స్టాప్ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అమలాపురం- రాజమండ్రి

నాన్‌స్టాప్ సర్వీసులకు రైట్.. రైట్

ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అమలాపురం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఏర్పాటుచేసిన నాన్‌స్టాప్, అల్ట్రా డీలక్స్ సర్వీసులను శుక్రవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ప్రయాణికులు ఎమ్మెల్యే దృష్టికి నాన్‌స్టాప్ సర్వీసుల విషయాన్ని తీసుకురావడంతో జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్పీపీ రాఘవకుమార్‌తో మాట్లాడి బస్సు సర్వీసులను ఏర్పాటుచేయించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో రాఘవకుమార్, ఇన్‌చార్జి డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్, గ్యారేజీ ఇన్‌చార్జి దేవి, ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎన్.వరహాలబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అమలాపురంలో పేకాడుతున్న 17 మంది అరెస్ట్

పంచాయతీ స్థలంలో అక్రమంగా షెడ్డు

రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో తొలగింపు

ఎవరైనా అనుమతి లేకుండా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలంటూ హెచ్చరిక

7



కష్టం.. నష్టమై..

పెరిగిన తుఫాన్ నష్టం.. రూ.200 కోట్లు పైనే..

మొంథా తుఫాన్ పెను విలయాన్ని సృష్టించలేదుగానీ.. దాని ప్రభావానికి నష్టపోని రంగమంటూ లేదు. ప్రాణనష్టం తప్పిందని సంతోషం మిగిలింది గానీ.. కొన్ని రంగాలు కోలుకోలేని స్థాయిలో దెబ్బతిన్నాయి. ఏ తుఫాన్ వచ్చిన సాగు మీదున్న పంటలకే తొలి నష్టం. ఈసారి అదే ఆనవాయితీ. సాధారణంగా ఆగస్టు తర్వాత వచ్చే తుఫాన్‌లకు ప్రతి ఏటా రైతు దొరికిపోతాడు. లేదా మాసూలు సమయంలో ప్రకృతి వైపరీత్యానికి తలవంచుతాడు. ఇప్పుడు సరిగ్గా వరి పంట ఈనిక దశలోనో, గింజ పాలుపోసుకునే దశలోనో ఉంది. ఈ సమయంలో పైరు పడిపోతే పశుగ్రాసానికి తప్ప దేనికీ పనికిరాదు. చివరి దశలో పడిపోయినా ఎంతోకొంత చేతికి దక్కుతుంది. అన్నదాతల కష్టం ఇలా నష్టాలపాలైంది. ఇక వాణిజ్య, కూరగాయల పంటలు.. ముఖ్యంగా కొబ్బరి, అరటి భారీగా దెబ్బతింది. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల నష్టం కోట్లలోనే ఉంది. రహదారుల పరిస్థితి మరీ దారుణం.



తుఫాన్ ప్రభావానికి అల్లవరంలో నేలనంటిన అరటి తోట, కుప్పకూలిన విద్యుత్ స్తంభం.. అమలాపురం రూరల్ మండలంలో రహదారిపై పడిన కొబ్బరిచెట్టు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు భారీగా నష్టాలు వాటిల్లాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా రూ.200 కోట్లు పైబడి నష్టం ఉండే అవకాశం ఉందని ప్రాథమిక అంచనా. జిల్లాలో అత్యధికంగా వ్యవసాయ రంగానికే భారీగా నష్టం సంభవించడంతో అన్నదాతలు కుదేలయ్యారు. వరితోపాటు ఉద్యాన పంటలు, కొబ్బరిచెట్లు కుప్పకూలడం వంటి నష్టాలతో అన్నదాతలకు రూ.80 కోట్లు పైబడే నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా బట్టి తెలుస్తోంది. తుఫాన్ వల్ల వీచిన ఈదురుగాలులు, తుఫాన్ తీరం దాటే సమయానికి ముందు.. తర్వాత కురిసిన వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా జిల్లాలో వరిసాగుకు సంబంధించి 1.63 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు. తుఫాన్ పరిస్థితుల వల్ల 65 వేల మంది రైతులకు చెందిన 30 వేల హెక్టార్లలో పంటలకు నష్టం జరిగింది. తద్వారా సుమారు రూ.77.50 కోట్ల నష్టం వచ్చినట్టు అంచనా వేశారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో పంట నష్టాలను అంచనా వేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో బృందాల ద్వారా నష్టాలను గుర్తిస్తున్నారు. అదేవిధంగా ఉద్యానశాఖకు సంబంధించి 4667 మంది రైతులకు చెందిన 1592 హెక్టార్లలో అరటి, బొప్పాయి, తమలపాకు, పసుపు, కూరగాయలు, పువ్వులు వంటి పంటలకు నష్టం సంభవించింది. జిల్లాలో 669 మంది రైతులకు చెందిన 950 కొబ్బరి చెట్లు విరిగిపడ్డాయి. వీటి కారణంగా 5.51 కోట్లు నష్టం వాటిల్లినట్టు ఉద్యానశాఖ అంచనా వేసింది. ఇక ఆర్‌డబ్ల్యుఎస్‌కు సంబంధించి 113 పనులకు సంభవించిన నష్టం వల్ల రూ.33 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్టు ఆ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి జిల్లాలోని 22 మండలాల్లో సుమారు రూ.46 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనాల నివేదికను అందజేశారు. మత్స్య శాఖకు సంబంధించి అంతర్వేది ఫిషింగ్ హార్బరుకు రూ.10లక్షలు, ఐదు మండలాల పరిధిలో చేపల పిల్లల ఉత్పత్తి కేంద్రాలకు రూ.50 లక్షలు, ఉప్పలగుప్తం మండలంలో 3512 చెరువులకు నష్టం వాటిల్లడం ద్వారా సుమారు రూ.50 లక్షలు నష్టం సంభవించినట్టు మత్స్యశాఖ అధికారులు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. జిల్లాలో 30వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయని, వారికి సహాయం అందించనున్నారు. ఐసీడీఎస్‌కు ఒక అంగన్‌వాడీ భవనంపై కొబ్బరిచెట్టు పడడం ద్వారా రూ.3లక్షల నష్టం వాటిల్లినట్టు అంచనా. చేనేత సహకార సంఘానికి సంబంధించి 4200 చేనేత కార్మిక కుటుంబాలు ఉన్నాయి. వారికి బియ్యం, ఆర్థిక సహాయానికి ప్రభుత్వం సిఫార్సు చేసింది. అదేవిధంగా జిల్లాలో 486 ఇళ్లకు నష్టం జరిగింది. వీటిలో 29 పక్కా ఇళ్లు, 163 కచ్చా ఇళ్లు, 294 తాటాకు ఇళ్లకు సంబంధించి సుమారు రూ.2 కోట్ల మేర నష్టం వాటిల్లింది. విద్యుత్‌శాఖకు సంబంధించి 300 స్తంభాలు నేలనంటినట్టు చెబుతున్నప్పటికీ నష్టాల వివరాలను ఆ శాఖ అధికారులు ఇంకా వెల్లడించలేదు. ఇంకా ఆర్‌అండ్‌బీ, డ్రైనేజీ, జలవనరులశాఖ, విద్యుత్ శాఖలకు సంబంధించి ప్రాథమిక నష్టాలు అందాల్సి ఉంది. అయితే జిల్లాలో ఐదు రోజుల వ్యవధిలో అన్ని శాఖలకు సంబంధించిన నష్టాలపై అధికారులు క్షేత్రస్థాయిలో ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాలను లక్ష్యంగా పెట్టుకుని నష్టాలను అంచనా వేయాలని కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశాలిచ్చినట్టు సమాచారం.



మృతురాలు వీరవేణు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం

మామిడికుదురు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో తాటిచెట్టు పడి మరణించిన మాకనపాలెం గ్రామానికి చెందిన వీరవేణు కుటుంబానికి ప్రభుత్వం అందించిన రూ.4 లక్షల ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్ సంయుక్తంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘటన జరిగిన అతి తక్కువ సమయంలోనే బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం సాయం అందించిందన్నారు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందనడానికి ఇదే నిదర్శనమని తెలియచేశారు. ప్రభుత్వం ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వేర్వేరుచోట్ల గాయపడ్డారని, వారికి అవసరమైన సాయాన్ని కలెక్టర్‌తో మాట్లాడి అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.



బండారులంక చెత్త సమస్యపై ఎమ్మెల్యే ఆనందరావు, వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మధ్య వాగ్వాదం

పురపాలక సంఘంలో ఫైల్స్ మాయం కావడమేంటి?

- సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే ఆనందరావు
- బండారులంక చెత్త సమస్యపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మధ్య వాగ్వాదం

అమలాపురం టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘంలో పలు విభాగాల్లో ఫైల్స్ మాయమయ్యాయి. పత్రాలు కనిపించకుండా పోతున్నాయా, ఇదెక్కడి దారుణం. సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌ను ఆదేశించారు. పారదర్శక పాలన సాగాలన్నా, జవాబుదారీతనంతో ఉద్యోగులు పనిచేయాలన్నా.. ఫైల్స్, పత్రాలు పక్కాగా ఉండాలన్నారు. ఏయే విభాగాల్లో ఏయే ఫైల్స్, పత్రాలు మాయమయ్యాయో గుర్తించాలన్నారు. ఫైల్స్ మాయం చేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన అధికార, విపక్షాల వాదోపవాదాలతో జరిగింది. తొలుత కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సర్క్యులర్‌బజార్‌లో అద్దె బకాయిల వివరాలను వెల్లడించాలన్నారు. ఇప్పటికే రూ.8.69 లక్షలు వసూలు చేశామని అధికారి వివరణ ఇచ్చారు. పురపాలక సంఘంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో పారిశుధ్యం అధ్వానంగా ఉందని వైసీపీ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పేర్కొన్నారు. దోమలబెడద నివారణకు డ్రోన్ స్ప్రేయింగ్‌లను వినియోగించాలని సూచించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, అలాగే కొత్తగా రెండు ఫాగింగ్ మిషన్లను కొనుగోలు చేశామని కమిషనర్ తెలిపారు. ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో డ్రోన్ స్ప్రేయింగ్ మిషన్లను కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ సూచించారు. వార్డుకు రూ.5 లక్షలు చొప్పున ఏటా ఖర్చు చేస్తున్నారని, రూ.3 కోట్ల మేర దోమల నివారణకు ఖర్చు చేసే బదులు డ్రోన్ స్ప్రేయింగ్ మిషన్లను ఎందుకు కొనుగోలు చేయరని ప్రశ్నించారు. ప్రజారోగ్యం దెబ్బతీసే విధంగా కల్తీలు జరుగుతున్నాయని ఆరోపించారు. స్లమ్ ఏరియాల్లో కనీసం బ్లీచింగ్ కూడా జల్లడం లేదని టీడీపీ కౌన్సిలర్లు బొర్రా వెంకటేశ్వరరావు, అబ్బిరెడ్డి చంటి పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. తాగునీటి సరఫరాలో ఆలం కలపడం మానేశారని, దానికి బదులు అల్యూమినియం ఫ్లోరైడ్ వాడుతున్నారని, ఏవిధంగా కలుపుతున్నారో కూడా అర్థం కావడం లేదన్నారు. ప్రజారోగ్యంతో ఆటలాడుకోవద్దని సూచించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ రూ.70 కోట్లతో పట్టణంలో 63 అడుగుల రోడ్లు వేయాలనుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే రెండు బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేశామని, అప్రోచ్ రోడ్లువేసి వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. వచ్చే వేసవిలో మరో ఆరు వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. హైవేలకు స్థానిక రోడ్లను అనుసంధానం చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం పురపాలక సంఘ ఆదాయం రూ.16 కోట్లు ఉందని, దాన్ని రూ.25 కోట్లకు పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు మాట్లాడుతూ మార్కెట్ సమీపంలోని శ్మశానవాటికలో కనీస సదుపాయాలు లేవని, తొలి ప్రాధాన్యం శ్మశానాల అభివృద్ధికి ఇవ్వాలన్నారు. రోడ్ల మీద రోడ్లు వేసుకునే విధానాలకు స్వస్తి పలికి పట్టణంలోని అన్ని శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని సూచించారు. తాగునీటి సమస్య దారుణంగా ఉందని ప్రతిపక్ష నేత యేడిద శ్రీను పేర్కొన్నారు. తాగునీటి సమస్యకు సంబంధించి సమస్య పరిష్కారానికి స్టాండింగ్ కమిటీ ఉందా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. స్టాండింగ్ కమిటీలు లేవని కొందరు సభ్యులు పేర్కొన్నారు. దాంతో సాంకేతిక నిపుణుల సమక్షంలోనే వాటర్ ఫ్యూరిఫై చేయిస్తున్నామని కమిషనర్ వివరణ ఇచ్చారు. పురపాలక సంఘంలో వికాస సంస్థ ఆధ్వర్యంలో అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది తొలగింపు అంశంపై చర్చ నిర్వహించారు. పురపాలక సంఘంలో 27 మందిని తొలగించి 50 మందిని కొనసాగించేలా సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. 2018లో చేపట్టిన పనులకు ఇప్పుడు బిల్లులు చెల్లించడం ఏమిటని రాజేష్ ప్రశ్నించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రభుత్వమే వాటిని నిర్మించి నిర్వహించాలని కోరుతూ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్లు కొల్లాటి దుర్గాబాయి, గొవ్వాల రాజేష్, మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని తదితరులు మాట్లాడారు.

బండారులంక చెత్త సమస్యపై..

బండారులంక అధికార విపక్షాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. ఒక దశలో ఎమ్మెల్యే ఆనందరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. బండారులంకలో చెత్త సమస్యను పరిష్కరించాలని ఆ పార్టీవారే ఆందోళన చేస్తారు. మళ్లీ ఆ చెత్తను అమలాపురం తీసుకువస్తే ఆ పార్టీ వారే అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకువచ్చేలా ప్రాజెక్టుకు రూపకల్పన జరుగుతోందని, రూరల్ మండలంలోని చెత్తను అమలాపురం తరలించి అక్కడి నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే అన్నారు. సెంటుంపావు స్థలంలో పేదలు ఎలా ఇళ్లు కట్టుకుంటారని ఎమ్మెల్యే ప్రశ్నించగా 31 లక్షల మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చిన చరిత్ర తమదేనని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.



ఎంకేఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం పోలీసులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తాన్ని ఇస్తున్న ఎస్పీ రాహూల్ మీనా. పాల్గొన్న ఎమ్మెల్యే బండారు, ఏఎస్పీ, డీఎస్పీ

రావులపాలెంలో పోలీసుల మెగా రక్తదాన శిబిరం

- రక్తదానం చేసిన ఎస్పీ మీనా
- హాజరైన ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పోలీసులు రావులపాలెంలో ఎంకేఆర్ ఫంక్షన్ హాలులో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ప్రారంభించారు. ముందుగా రక్తదాన ఆవశ్యకతను అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఎస్పీ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ సమాజ రక్షణలో పోలీసుల పాత్ర కీలకమైనదన్నారు. దేశ సమగ్రత కోసం ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగం అమూల్యమైనదన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ శాంతి భద్రతల పరిరక్షణకోసమే కాకుండా సామాజిక సేవలోనూ ముందుంటుందన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన ఆలమూరు ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్ సేవలు ఎనలేనివని వారు కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌డీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, సీఐలు శేఖర్‌బాబు, సీహెచ్ విద్యాసాగర్, ఆర్.భీమరాజు, సమీప పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.



చివరి... బాతులకు చేటి...

మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పాలు పోసుకుంటున్న దశలో వున్న వరి చేలు నిండా మునిగాయి. చేలల్లో వున్న వరి గింజలు ఎందుకూ పనికారావు. శాకాహారి అయిన బాతులు మాత్రమే వీటిని తింటాయి. శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో రైతులు చేలల్లో వదిలేసిన ధాన్యం గింజలను బాతులు తింటుండగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది. ఆ చిత్రాలే ఇవి...

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





ఆకాశవీధిలో హాయిగా ఎగిరే మేఘమాలికలను ప్రేమికుల నడుమ విరహ సందేశాలుగా పంపగల అభినవ కాళిదాసు ఆయన... మనసున మధుర భావనలను సరళ, లాలిత్యమైన అచ్చతెనుగు పదజాలంతో సామాన్యుని మనోవీధిలో ఎగిరించారు... పద్యానికైనా, పాటకైనా, మరే సాహిత్య రూపమైనా... రూప వ్యవస్థ కంటే భావోన్నతే ముఖ్యమని ప్రకటించి భావ కవి అయ్యారు.



ఆకులో ఆకునై కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై ఈ అడవి సాగిపోనా.. ఎటులైనా ఇచటనే ఆగిపోనా.... అంటూ తన భావ కవితా పటిమతో ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించిన కవి ఆయన. తన రచనలతో పేరు ప్రఖ్యాతలు గడించారు. సినీ సాహిత్యంలోనూ తనదైన ముద్ర వేసి మూడు దశాబ్దాల పాటు చిత్రసీమలో హవా కొనసాగించారు. ఆయన పాటలు కోయిల గానంలా హాయిగా సంధ్యా సమయంలో గోదావరి గాలిలా ఆహ్లాదకరంగా ఉంటాయి. అంతటి కమ్మని, నెమ్మని రచనలతో తనకంటూ ఓ శైలిని రూపొందించుకున్న ఆయన సదా సాహిత్య స్మరణీయుడు. ఆ భావ కవితా చక్రవర్తి దేవులపల్లి కృష్ణశాస్త్రి. నేడు ఆయన 128వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం...



భావ కవితల పాలవెల్లి
ఆంధ్రా షెల్లీ

- రావువారిచంద్రపాలెంలో పుట్టి విశ్వ విఖ్యాతి
- సాహితీ పూదోటలో పరిమళాలు
- చిత్రసీమలో మూడు దశాబ్దాలు హవా
- 'వసంత విలాసి' దేవులపల్లి కృష్ణశాస్త్రి 128వ జయంతి సందర్భంగా



(సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం రావువారిచంద్రంపాలెంలో 1897 నవంబరు 1న దేవులపల్లి తమ్మన్నశాస్త్రి-సీతమ్మలకు కృష్ణశాస్త్రి జన్మించారు. పువ్వు పుట్టగానే పరిమళించినట్టు ఆయనకు కవిత్వ వాసన అబ్బింది. తండ్రి, పెద తండ్రి స్ఫూర్తితో చిన్నతనం నుంచే సాహిత్యం పై మక్కువ పెంచుకున్నారు.

- రావువారిచంద్రంపాలెంలో ప్రాథమిక విద్య, పిఠాపురంలో ఉన్నత విద్య, 1918లో విజయనగరం డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు.
- కందుకూరి వీరశలింగంపంతులు, రఘుపతి వెంకటరత్నంనాయుడు శిష్యరికంలో బ్రహ్మసమాజ ప్రభావ గీతాలు రచించారు. ఆంగ్ల, వంగ సాహిత్యాలపై దృష్టి కేం ద్రీకరించారు. ఆ ప్రభావంతోనే కృష్ణపక్షం సంపుటి రాశారు. 1920 నుంచి 1935 వరకు ఆయన అందరిపైనా ప్రభావం చూపారు.
- 1922లో సతీ వియోగంతో 'కన్నీరు' అనే ఖండకావ్యం, ఊర్వశి రాశారు.
- 1929లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌ను కలిశాక ఆ పరిమళం పైపైకి ఎగసి ప్రపంచమంతా పాకి 'ఆంధ్ర షెల్లీ' బిరుదు సంపాదించిపెట్టింది. రవీంద్రుని కవిత్వానికి అయన అద్దిన భావ తళుకులు ఎందరినో ఆకట్టుకున్నాయి.
- పెద్దాపురం లూథరన్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరిన కృష్ణశాస్త్రి సంస్కర ణోద్యమం, బ్రహ్మసమాజం, నవ్య సాహితీ సభ్యులుగా భావ కవి తోద్యమ ప్రచారకుడిగా దేశమంతా పర్యటించారు.
- స్త్రీ, హరిజనోద్ధరణ కార్యక్రమాలు చేపట్టారు. 1933-1941 మధ్య కాలంలో కాకినాడ పీఆర్ కళాశాలలో ఉపన్యాసకుడిగా పని చేశారు.
- 1942లో నిర్మాత బీఎన్ రెడ్డి ప్రోత్సాహంతో చిత్రసీమలో అడుగుపెట్టారు. 1951లో మల్లీశ్వరి చిత్రంలో ఆయన రాసిన ప్రతి పాట సినీ రంగంలో ప్రత్యేక స్థానం కల్పించాయి. 25 సినిమాల్లో 170 పాటలు రచించారు. ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు, మనసున మల్లెలు మాలలూగెనే... వంటి గీతాల పునాదులపై ఆయన చిత్ర జీవితం పాటలా సాగింది.
- దేవులపల్లి సుకుమార సుందర సుమధుర లలిత మనోహర భావాలతో మూడు దశాబ్దాల పాటు సినీ సామ్రాజ్యాన్ని ఏలారు.
- 1945లో ఆకాశవాణిలో చేరాక తెలుగు సాహిత్యమే ఆయనకు వ్యాపకమైంది. దేశభక్తి గీతాలు, గేయ మాలికలు, గేయ కృతులు, పద్య కవితలు, లలిత లాలిత్య గీతాలు, సంగీత రూపకాలు, పిల్లల పాటలు, తిరుప్పావై పాశురాలతో ప్రాచుర్యం గడించారు. హైదరాబాద్ ఆకాశవాణి నుంచి ప్రసారమైన ఇవి ప్రజాదరణ పొందాయి.
- గోదా కల్యాణం, ధనుర్దాసు, వేణుంకుంజా, వసంతోత్సవం వంటి నాటకాలు ఎంతో ప్రసిద్ధి పొందాయి.
- దేవులపల్లి చివరి రోజుల్లో 'గోరింట పూచింది కొమ్మ లేకుండా పాట రచించారు. ఆయన రాసిన 'జయజయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి' గీతం జాతీయ గీతానికి అన్ని అర్హతలు ఉన్న గీతంగా గుర్తింపు పొందింది.
- కృష్ణశాస్త్రిని ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణతోను, కేంద్ర ప్రభుత్వం పద్మ భూషణ్‌తోను సత్కరించాయి.
- 1966లో కంఠం మూగబోయినా రచనలు కొనసాగించారు. 1980 ఫిబ్రవరి 24న తుది శ్వాస విడిచారు.
- దేవులపల్లి కృష్ణశాస్త్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదివిన ఇద్దరు విద్యార్థులు మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. వారి సమక్షంలో దేవులపల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం కృష్ణశాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించనున్నారు.
- దేవులపల్లి మరణించి 45 ఏళ్లు కావస్తున్నా ప్రభుత్వం ఆయన్ను సరైన రీతిలో గుర్తించలేదు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు హయాంలోనైనా ప్రభుత్వం తరపున కృష్ణశాస్త్రికి, ఆయన స్వగ్రామమైన రావువారి చంద్రంపాలేనికి తగిన గుర్తింపు లభించగలదని ఆశిద్దాం.



తన జన్మ స్థలమైన రావువారి చంద్రంపాలెంలో అందరినీ విద్యావంతులు చేయాలన్న ప్రగాఢ కాంక్షతో తన సొంతింటిని పాఠశాల నిర్వహణకు ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చిన ధన్యజీవి. నేటికీ అయన ఇంటి ఆవరణలోనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తుండడం గర్వకారణం. అక్కడే దేవులపల్లి అభిమానులు ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయగా 2004లో అప్పటి కలెక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆవిష్కరించారు.

ఎంఎస్‌ఎంఈ యూనిట్ల మంజూరుకు కృషి

ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్ శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రహమతుల్లా

సర్పవరం జంక్షన్, అక్టోబరు 31(ఆంధ్ర జ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఖాదీ గ్రామీణ బోర్డు ద్వారా ఎంఎస్ఎం ఈ యూనిట్లు మంజూరు చేయించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేస్తానని ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు తెలిపారు.కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఏరియాలో గల ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు జిల్లా కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. శ్రీనివాసరావుకు అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ రహమతుల్లా పుష్పగుచ్ఛమిచ్చి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు నిరుద్యోగ యువత కోసం అమల్లో ఉన్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ఎంఎస్ఎంఈ యూనిట్లు, సంప్రదాయ పరిశ్ర మల స్థాపనకు ఉన్న అవకాశాలను ఏడీని అడిగి తెలుసుకున్నారు. తొలుత ఆయన ఎమ్మెల్యే నానాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటికాయల వీరబాబు, పాండ్రంకి రాజు, గేదెల చిన్నారావు, కుర్రా నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

3న జాబ్‌మేళా

కాకినాడ సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్ ఆవరణలో వికాస కార్యాలయంలో ఈ నెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్‌లో టీమ్ మేనేజర్, ఐఅండ్‌వీ బయో ఇండియా కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, ప్రొడక్షన్ యూనిట్, ఏజీ ఐ గ్రీన్ ప్యాక్ కంపెనీలో ప్యాకింగ్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ(ప్రొడక్షన్, మెకానికల్ మెయింటెనెన్స్) ఐసాన్ ఎక్స్‌పీరియన్స్‌లో టెలీ సేల్స్ రిప్రజెంటెటివ్, ఇసుజు మోటార్స్ కంపెనీలో టెక్నీషియన్, ఫాక్స్‌కాన్ కంపెనీలో మొబైల్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్, బీఈ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12,000-రూ.30,000 వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలకు బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టి ఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మ రిన్ని వివరాలకు సెల్ నెంబరు 77993 762 22లో సంప్రదించాలని చెప్పారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన చిట్యాల విద్యార్థులు

గోపాలపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు తూర్పుగోదావరి జిల్లా చిట్యాల జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వైఎస్ఎన్ మూర్తి తెలిపారు.ఇటీవల కొవ్వూర్వులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 జిల్లా స్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థి ధనుష్, 8వ తరగతి విద్యార్థి ఆర్యాఆనంద్ పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీను, సీఆర్‌సీ కొయ్య నాగరాజు అభినందించారు. కాగా, ఈనెలలో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారిద్దరూ పాల్గొంటారని చెప్పారు.

రాయవరం నుంచి..

రాయవరం, అక్టోబరు 31(ఆంధ్ర జ్యోతి): జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాయవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పోలిశెట్టి భార్గవ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం విప్పర్తి శాంతి సునీత శుక్రవారం తెలిపారు.భార్గవ్ ఇటీవల అనపర్తిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన పోలిశెట్టి భార్గవ్

శనివారం కొవ్వూరులో జరిగే పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, పీఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, పీడీలు చిక్కాల అజ్జిబాబు, కె.శ్రీనివాస్ అభినందించారు.

జి.దొంతమూరు నుంచి..

రంగంపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శనివారం కొవ్వూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని జి.దొంతమూరు హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న దుప్పలపూడి కామేశ్వరి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు కేవీ రామారావు తెలిపారు. అనపర్తి హైస్కూల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలికల పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన కామేశ్వరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ ఈ.లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఆత్మకమిటీ చైర్మన్ ఎలుగుబంటి సత్తిబాబు, జనసేన మండలాధ్యక్షుడు గిరజాల సత్తిబాబు, సర్పంచ్ గోలి రమణ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటకృష్ణ,కూటమి నాయకులు ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా సప్త నదీ జలాభిషేక మహోత్సవం



ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు

ఘనంగా రామస్వామి జయంతి

పిఠాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శుక్రవారం సప్త నదీ జలాభిషేకం వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన మహోత్సవాలు ముగిశాయి. ఉదయం శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాదుకలకు దత్త మూలమంత్ర సప్త నదీజలాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, సాయంత్రం లక్ష్మీగణపతి సహిత రుద్రహోమం, దత్త మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. పీఠాధిపతి సజ్జనగడ రామస్వామి ఏకోత్తర శత జయంతి సందర్భంగా ఆయన పాదుకలకు పూజలు చేశారు. గోపూజ, అభిషేకాలు జరిగాయి. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శ్రీపాదశ్రీవల్లభులకు సప్తనదీజలాలతో అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

బాస్కెట్‌బాల్ మెన్ అండ్ ఉమెన్ ఎంపికలు



బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులతో వాసంశెట్టి సత్యం

ద్రాక్షారామ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ సెలెక్షన్స్ అండ్ ఛాంపియన్‌షిప్ బాస్కెట్‌బాల్ పోటీలను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గన్నమని చక్రవర్తి క్రీడాకారులు ఎదుర్కొనే పలు సమస్యలను సత్యం దృష్టికి తీసుకొచ్చారు. సాయంత్రం చీకటి వల్ల ఇబ్బందులున్నాయని, లైట్స్ కావాలని ఆయనను కోరారు. దీనిపై సత్యం స్పందించి లైటింగ్‌కు రూ.2 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బోటు ఫెస్టివల్ పోటీల నిర్వహణకు చర్యలు



లొల్ల లాకులను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

లొల్ల లాకులను పరిశీలించిన ఆర్డీవో శ్రీకర్

ఆత్రేయపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాబోయే సంక్రాంతి మూడు రోజులు బోటు ఫెస్టివల్ పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు ఆర్డీవో శ్రీకర్ తెలిపారు. శుక్రవారం లొల్ల లాకులు, తాడిపూడి, ఉచ్చిలి ప్రధాన కాలువలను ఆయన పరిశీలించారు.గతేడాది బోటు ఫెస్టివల్ కంటే అదనంగా మరిన్నీ కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను తిలకిచేందుకు వచ్చే పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎంతో ఆహ్లాదకరమైన ఈ ప్రాంతంలో కార్తీకమాసం పిక్నిక్‌లు నిర్వహించేందుకు అనువైన లాకుల ప్రాంతాన్ని తీర్చిదిద్దాలన్నారు. తహశీల్దారు రాజేశ్వరరావు, ఆర్ఐ భాను పాల్గొన్నారు.

ఆధునిక ఎలక్ట్రిక్ షిప్పుల తయారీకి ఒప్పందం



ఒప్పంద పత్రం చూపుతున్న శాన్ మారిటైమ్ షిప్పింగ్ సంస్థ ఎండీ అహ్మద్ అలీషా

కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయిలో ముంబై వేదికగా అక్టోబరు 27నుంచి 31వరకు జరిగిన ఇండియా మారిటైమ్ వీక్-2025 సదస్సులో పాల్గొన్న కాకినాడకు చెందిన శాన్ మారిటైమ్ షిప్పింగ్ సంస్థ జపాన్, నార్వే సాంకేతిక సహకారంతో ఆధునిక ఎలక్ట్రిక్ షిప్పుల తయారీకి భారత ప్రభుత్వంతో సాంకేతిక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ దేశాల షిప్పింగ్ దిగ్గజ సంస్థల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పోర్టులు, నౌకాశ్రయాలు, షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, పలువురు కేంద్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు శాన్ మారిటైమ్ షిప్పింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ అలీషాను అభినందించారు.

పోలీస్ అమర వీరులకు సెల్యూట్



పోలీసు అమరవీరుల వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి త్రీటౌన్ పోలీస్ స్టేషను నుంచి పుష్కర్‌ఘాట్ వరకూ పోలీసులు, ప్రజలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు అజరామరమని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. వారి సేవలను భరత జాతి ఎన్నటికీ మరువదన్నారు.

-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి).

హెరాల్డింగ్ పరేడ్‌లో ముక్కామల కళాకారులు



ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుడు కుమార్

అంబాజీపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని కెవడియా ఏక్తా నగర్‌లో సంగీత నాటక అకాడమీ- భారత మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ ఆధ్వర్యంలో జరిగిన హెరాల్డింగ్ పరేడ్‌లో ముక్కామలకు చెందిన కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో దేశ వ్యాప్తంగా దాదాపు 120మంది కళాకారులు పాల్గొనగా ఏపీ నుంచి ఇద్దరు కళాకారులు ఉండగా విజయదుర్గ గరగల బృందం తరపున పసుపులేటి కుమార్(డోలు)ను పంపించామని ట్రూప్ లీడర్ పసుపులేటి నాగబాబు తెలిపారు. ప్రధాని మోదీ ఎదుట ఈ ప్రదర్శన ఇవ్వడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. తొలుత సంగీత నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ సంధ్య, కొరియోగ్రాఫర్ లోకేశ్ ఆనంద్ నేతృత్వంలో పది రోజులు రిహార్సల్స్ జరిగాయన్నారు.

గిరిప్రదక్షిణ విజయవంతం చేయాలి

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

పరిశీలించిన అన్నవరం దేవస్థానం ఈవో, చైర్మన్



గిరిప్రదక్షిణ రోడ్డులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో, చైర్మన్, అధికారులు

అన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కోరినకోర్కెలు తీర్చే భక్తవరదాయుడు అన్నవరం సత్యదేవుడికి ఈనెల 5న కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని గిరిప్రదక్షిణ కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరగనుంది. సుమారు 2లక్షల మంది భక్తులు కాళ్లకు చెప్పులు లేకుండా సుమారు 11.5 కిలోమీటర్ల మేర రత్న,సత్యగిరిలు చుట్టూ ఉదయం పల్లకీతో, మధ్యాహ్నం సత్యరథంతో తిరుగుతారు. వారికి అసౌకర్యం కలగకుండా చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పరిశీలించారు. ఈ దారిలో వైద్యశిబిరాలు, భక్తులకు పంచిపెట్టేందుకు పళ్లు, మజ్జిగ వితరణ బిస్కట్ల పంపిణీ స్టాల్స్‌ను పరిశీలించారు. రోడ్డుపై ఎటు వంటి రాళ్లు లేకుండా రోలింగ్ చేయించాలని చైర్మన్ సూచించారు. భక్తులు మధ్యాహ్నం రెండు గంటలకు తొలిపావంచా వద్దకు చేరుకుని సత్యరథం వెంట గిరిప్రదక్షిణ చేసేలా విస్తృత ప్రచారం గావించాలని పీఆర్వో విభాగ అధికారులను ఆదేశించారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా స మన్వయంతో గిరిప్రదక్షిణను విజయవంతం చే యాలని కోరారు. వారివెంట ఇంజనీరింగ్, పీఆర్వో, విభాగ అధికారులతో పాటుగా ఏఈ వోలు, సూపరెంటెండెంట్‌లు పాల్గొన్నారు.



పంపా రిజర్వాయర్‌లో ట్రయిల్‌రన్ నిర్వహిస్తున్న అధికారులు

తెప్పోత్సవానికి జాగ్రత్తలు తీసుకోవాలి

పంటుకు రెండోసారి ట్రయిల్‌రన్ విజయవంతం

అన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది సత్యదేవుడి తెప్పోత్సవం నిర్వహణలో జాగ్రత్తలు మరింతగా తీసుకోవాలని చైర్మన్ రోహిత్ సూచించారు. ఈనెల 2న రాత్రి 7గంటలకు పంపా సరోవరంలో నౌకావిహారం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం రెండోపర్యాయం అన్నిశాఖల అధికారులు, ఈవో, చైర్మన్ హంసవాహనంగా రూపుదిద్దుకోనున్న పంటుకు ట్రయిల్ రన్ నిర్వహించారు. పంపా రిజర్వాయర్‌లో ఈసారి నీటిమట్టం అధికంగా ఉన్నందున అనుమతించిన వైదిక సిబ్బందిని మాత్రమే పంటుపైకి ఎక్కించాలని, ఈ విషయంలో సిఫార్సులకు తలొగ్గవద్దన్నారు. లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేవిధంగా కోఆర్డినేట్ చేసుకోవాలని చైర్మన్ సూచించారు. నిర్దేశించిన సమయానికి వైదిక కార్యక్రమాలు, నౌకావిహారం జరగాలన్నారు. అనంతరం ప్రసాద వితరణలో క్యూలైన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని సూచించారు.

'ఎంఎస్ఎన్' ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం



ధర్మకర్తల మండలిని సత్కరించిన దృశ్యం

కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలో మల్లాడి సత్యలింగం నాయకర్ చారిటీస్ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయకర్ చైర్మన్‌గా వ్యవహరించారు. ధర్మకర్తలుగా నులుకుర్తి శ్రీసత్యసాయి, మూగు చిన్ని, పిల్లారిశెట్టి దుర్గాప్రసాద్, రాళ్లపూడి ప్రకాష్, పీర్ల లక్ష్మీప్రసన్న, అరదాడి భవాని, ఓలేటి దుర్గ, మందపాక త్రిలోచన, ధూళిపాల సూర్యభగవాన్‌తో సహాయ కమిషనరు, ఈవో బళ్ల నీలకంఠం ప్రమాణం చేయించారు. ఎలిమెంటరీ స్కూలు, హైస్కూలు, ప్రధానోపాధ్యాయులు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో గరికపాటి పూజలు



వేదాశీర్వచనాలు పొందుతున్న గరికపాటి నరసింహారావు కుటుంబం

అన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. బంధువుల వివాహానికి హాజరైన వారు కొండదిగువన వివాహం అనంతరం స్వామివారి సన్నిధికి విచ్చేశారు.

ఘనంగా చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

నిండుకుండలా...

ఏలేరు జలాశయం

దిగువకు 6వేల క్యూసెక్కుల నీరు విడుదల



ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు

ఏలేశ్వరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీస్థాయిలో వరద నీరు వచ్చి చేరడంతో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా జలాశయం నుంచి 6వేల క్యూసెక్కుల నీటిని శుక్రవారం విడుదల చేశారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. తుపాను కారణంగా ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. దీంతో ఎగువ ప్రాంతంలో కురిసే భారీ వర్షాలతో ప్రాజెక్టులో వరద నీరు చేరడంతో కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం మండలాలకు ప్రమాదం పొంచి ఉందని అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులో 6175 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ప్రాజెక్టులో మరో రెండు టీఎంసీలు నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. దీంతో ప్రాజెక్టులో శుక్రవారం నాటికి 86.56 మీటర్లకుగాను 85.71 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 22.38 టీఎంసీలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కుల నీటిని, దిగువ ప్రాంతాలకు 6వేల క్యూసెక్కులనీటిని అధికారులు విడుదల చేశారు.

హైవేపైకి ఏలేరు వరద నీరు



గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో హైవేపైకి చేరిన ఏలేరు వరద నీరు

గొల్లప్రోలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో 216వ జాతీయ రహదారిపైకి శుక్రవారం మధ్యాహ్నం ఏలేరు వరద నీరు చేరింది. ఏలేరు కాలువలకు గండ్లు పడడంతో పొలాల మీదుగా వచ్చి న వరద నీరు రోడ్డుపై నిలిచిపోయింది. రైతులు గట్లుపై ఇసుకబస్తాలు వేసి నీరు రాకుండా కట్ట డి చేయడంతో రహదారిపై నీరు సాయంత్రం నుంచి పెరగలేదు. లేకుంటే జాతీయ రహదారిపై ఒకవైపు వరద నీరు ప్రవహించేదని అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై అసత్య ప్రచారం..

భరత్‌రామ్‌పై చర్యలు తీసుకోండి

రాజమహేంద్రవరంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ లీగల్ సెల్ ఫిర్యాదు



త్రీటౌన్ సీఐకు ఫిర్యాదు అందిస్తున్న టీడీపీ లీగల్ సెల్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై నిరాధారమైనఆరోపణలు చేస్తున్న వైసీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎంపీ భరత్‌రామ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ లీగల్‌సెల్ కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం ఉదయం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు, లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్ చేరుకుని సీఐ అప్పారావుకు ఫిర్యాదు అందించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసు వ్యక్తిగత, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా భరత్‌రామ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో అసత్యప్రచారం చేస్తున్నారని వివరించారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విగ్గు పెట్టుకుని స్టైల్‌గా కళ్లజోడు పెట్టుకుని మద్యం తాగి అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్నారంటూ అభాండాలు వేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ జగన్ పెగ్గు పోశారని ఒప్పుకుంటే బాలయ్యబాబు మద్యం తాగారని తాము ఒప్పుకుంటామని సమాధానమిచ్చారని, అయితే జగన్ పోసాడా అనే మాటలను కట్ చేసి తాగి వచ్చారు అనే మాటలతో సోషల్ మీడియాలో ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా భరత్‌రామ్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీను, బూరా రమణ, ఉడమల నాగేశ్వరరావు, చెన్నా వెంకటరమణ, కారంగి వీర్రాజు, బత్తిన రవికుమార్, కొమరం సురేష్, దుత్తరపు గంగాధర్, కానేటి ప్రభుదాస్, బాబ్జి పాల్గొన్నారు.

పరిపాలనాధికారులకు ఎంపీడీవోలుగా పదోన్నతి

కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారులుగా పనిచేస్తున్న ఇద్దరికి ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. వారికి మండలాలు కేటాయించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ఎంపీడీవోగా జేఎల్ఎన్ దీక్షితులు, కాకినాడ జిల్లా కరప ఎంపీడీవోగా జె.శ్రీనివాస్ నియమితులయ్యారు. కార్యక్రమంలో జడ్పీ ఇన్‌చార్జి సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

నా భర్తను కిరాతకంగా చంపారు..

న్యాయం చేయండి

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి మృతుడి భార్య వేడుకోలు



కొంకాపల్లిలో విలపిస్తూ తన గోడును వివరిస్తున్న కంచిపల్లి శ్రీదేవి

అమలాపురం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): "నా భర్తను అతి కిరాతకంగా చంపి నదీ పాయలో పడేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇద్దరు బిడ్డలతో ఉన్న నా కుటుంబానికి న్యాయం చేయాలి" కంచిపల్లి దేవి వేడుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సోషల్ మీడియా వేదికగా శుక్రవారం తన గోడును వెల్లబోసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన నా భర్త కంచిపల్లి శ్రీనివాస్ (37) అక్టోబరు 25న ఇంటి నుంచి వెళ్లి 29న పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలోని గోదావరి నదీపాయలో శవంగా కనిపించాడని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులకు 27నే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వివరించింది. గంగుమళ్ల కాసుబాబు, అడబాల శంకర్‌ల బృందం తన భర్తను అతి కిరాతకంగా చంపేశారని ఆరోపించింది. తన కుటుంబానికి మీరే న్యాయం చేయాలని వేడుకుంటూ సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేసింది. ఇలా ఉండగా హత్య అనంతరం అదృశ్యమైన కాసుబాబుతో సహా ఐదుగురు వినియోగించిన సెల్‌ఫోన్ల కాల్స్ ఆధారంగా కేసును చేధించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే ప్రధాన నిందితులు వినియోగించిన ఫోన్ కాల్ డేటా ఆధారంగా హత్యకు ముందు ఎవరెవరితో మాట్లాడారు, హత్యకు ఎవరు సహకరించారు అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన ఏరియా ఆసుపత్రి నుంచి శుక్రవారం నివేదిక వస్తుందని పోలీసులు భావించారు. కేసును చేధించేందుకు ప్రత్యేక బృందాలు గాలింపును ముమ్మరం చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇలా ఉండగా శ్రీనివాస్ ఇంటి వద్ద చిన్న కార్యక్రమం నిర్వహిస్తుండడంతో ఏదైనా ఆందోళన జరగవచ్చన్న సమాచారంతో డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు అప్రమత్తమయ్యారు. ఏ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

ఏపీఆర్డీసీ డైరెక్టర్‌గా వెన్న శివ నియామకం



వెన్న శివ

ప్రత్తిపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కత్తిపూడి గ్రామా నికి చెందిన టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్న ఈశ్వరుడు (శివ)ను ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలపెమెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ)డైరెక్టర్ నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 16అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 16 మందిని ఏపీఆర్డీసీ డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తనకీ ఉన్నత పదవి అవకాశం కల్పించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభకు శివ ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, ఏళ్ళ జగదీష్, బద్ది రామారావు, సాధానాల లచ్చింబాబు అభినందనలు తెలిపారు.

ఏపీఆర్డీసీ సభ్యుడిగా ముదునూరి వేణుగోపాలకృష్ణ

అమలాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్డీసీ) సభ్యుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ముదునూరి వేణుగోపాలకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఆర్డీసీ సభ్యుడిగా రెండేళ్ల పాటు పద విలో వేణుగోపాలకృష్ణరాజు కొనసాగనున్నారు.

పంచాయతీ స్థలంలో అక్రమంగా షెడ్డు

రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో తొలగింపు



వల్లూరులో షెడ్డును తొలగిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామంలోని పంచాయతీ స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మాణం జరిగిందంటూ గ్రామకార్యదర్శి సత్తిబాబు, తహశీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీవో హెచ్.భానూజీరావు కు ఫిర్యాదు అందింది. దీనిపై శుక్రవారం రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో షెడ్డు తొలగించారు. కార్యదర్శి సత్తిబాబు తెలిపిన వివరాల ప్రకారం... వల్లూరు గ్రామపంచాయతీ పరిధిలో నిడసనమెట్టకు వెళ్లే రహదారి పక్కనే ఉన్న సర్వే నెం.205బై6లో 9 సెంట్లు పంచాయతీ స్థలం ఉంది. ఆ స్థలంలో గతంలో దళిత సామాజిక వర్గీయులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ విగ్రహానికి చేర్చి గత నెల 20న మళ్లీ నూతనంగా షెడ్డు నిర్మాణం చేశారు. ఆ స్థలం ప్రజలకు అవసరార్థం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి పంచాయతీ కేటాయించింది. పంచాయతీ అనుమతులు లేకుండా ఆ స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మాణం జరిగినట్టు తన దృష్టికి రావడంతో వెంటనే తహశీల్దార్, ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. దీనిపై తహశీల్దార్ సదరు ఆక్రమణ తొలగింపునకు పోలీస్ రక్షణ కావాలంటూ అంగర ఎస్ఐ హరీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆధ్వర్యంలో అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేయగా పంచాయతీ అధికారులు అక్రమంగా నిర్మించిన షెడ్డను తొలగించారు. సీఐ దొరరాజు మాట్లాడుతూ ఎవరైనా అక్రమ చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయవరం, ద్రాక్షారామం ఎస్ఐలు, మండపేట ట్రైనీ ఎస్ఐలు సురేష్‌బాబు, లక్ష్మణబాబు, సోమేంద్ర, ఆర్ఐ అర్జమ్మ తదితర సిబ్బంది ఉన్నారు.

తప్పిపోయిన రేపాక ఆశ్రమ పాఠశాల విద్యార్థి

కూనవరం వద్ద పోలీసులకు క్షేమంగా దొరికిన బాలుడు



పోలీసుల వద్ద క్షేమంగా ఉన్న విద్యార్థి తేజ

కూనవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అ ల్లూరి జిల్లా కూనవరం మండలం రేపాక ఆశ్ర మ పాఠశాల విద్యార్థి గుజ్జ స్వాత్విక్ తేజ గురువారం పాఠశాల నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తేజ వెళ్లిపోయినట్టు గుర్తించిన సిబ్బంది ఈ మేరకు కూనవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ లతాశ్రీ శుక్రవారం సోషల్ మీడియా ద్వారా బాలుడు తప్పిపోయినట్లు ప్రచారం చేశారు. శుక్రవారం రాత్రి 7 గంటల స మయంలో విద్యార్థి తేజ కూనవరం సెంటర్‌లో కనిపించడంతో గ్రామస్తులు ఎస్ఐకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ బాలుడిని గుర్తిం చి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం బాలుడు పోలీసుల దగ్గర క్షేమంగా ఉన్నాడు. అయితే హెచ్ఎం, వార్డెన్ నిర్ల క్ష్యం కారణంగానే విద్యార్థి బయటకు వెళ్లిపోయినట్లు విమర్శలు వస్తున్నాయి. దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అదృశ్యమైన బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

కొవ్వూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన మైనర్ బాలికలను 24 గంటల్లో వెతికి కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లిలో నివసిస్తున్న మైనర్ బాలికలైన అవల కీర్తి, అవల నవ్య అక్టోబరు 30న ఉదయం 10 గంటలకు పూసలు అమ్ముకోవడానికి అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి ఆటోలో బయటకు వచ్చారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికలు ఎక్కిన ఆటోడ్రైవర్‌ను విచారించగా బాలికలు ఆటోడ్రైవర్ ఫోన్ నుంచి గతంలో వాడపల్లిలో తమ ఇంటిపక్కనే నివాసం ఉన్నవారికి జంగారెడ్డిగూడెం ఫోన్ చేశారని తెలిపాడు. పోలీసులు జంగారెడ్డిగూడెం వెళ్లి బాలికలను తీసుకొచ్చి తహశీల్దార్ స్టేట్‌మెంటు తీసుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. తల్లి మందలించడంతో బాలికలు జంగారెడ్డిగూడెం వెళ్లినట్టు పేర్కొన్నారు.



ధర్మవరంలో పత్తి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పత్తి పంటల పరిశీలన

ప్రత్తిపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో దెబ్బతిన్న పత్తి పంటలను శుక్రవారం ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఎం.రాంభద్ర రాజు, ఐ.సుధీర్, వ్యవసాయ సహాయ సంచాలకులు జి.శ్రీనివాస్. పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి జోకా అమృత, పెద్దాపురం ఏరువాక కేంద్రం అధికారులతో కలిసి శాస్త్రవేత్తలు దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటపై ఆశించిన కాయకుళ్లు తెగులు నివారణకు పాటిచాల్సిన విషయాలు వివరించారు. ధర్మవరం రైతు సేవా కేంద్ర సిబ్బంది తదితరులు ఉన్నారు.

పేకాడుతున్న 17 మంది అరెస్ట్

అమలాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని భూపయ్య అగ్రహారం, వడ్లమానివారి వీధిలో గల ఒక అపార్టుమెంటులో పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారు. పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. పేకాడుతున్న రాజకీయ పార్టీకి చెందిన కీలక నాయకులతో సహా సుమారు 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30,140 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయితే అమలాపురం పట్టణ పరిసరాల్లో పేకాట క్లబ్‌లు నిర్వహిస్తున్నారనే సమాచారాన్ని సోషల్ మీడియాలో మహిళా నేత బొజ్జా ఐశ్వర్య ఇటీవల ఒక వీడియో విడుదల చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీకి అందిన సమాచారంతో గురువారం రాత్రి దాడిచేసి 17మందిని అదుపులోకి తీసుకున్నారు.

యానాం నుంచి బీర్లు రవాణా

ఇద్దరిపై కేసు

కొవ్వూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యానాంలో 24 టిన్ బీర్లను కొనుగోలు చేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణానికి చెందిన దాసరి పృథ్వీ వెంకటసాయి నితీష్, గడుసుకోట భానుప్రకాష్ అక్టోబరు 29న యానాంలో 24 టిన్ బడ్వయిజర్ బీర్లను కొనుగోలు చేసి కారులో నిడదవోలు తీసుకువస్తుండగా మద్దూరులంక బ్యారేజ్‌పై మోటారుసైకిల్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో గ్యాస్ ఏజన్సీ ఆటోడ్రైవర్ చాగల్లు మండలం దారవరానికి చెందిన షేక్ ఖాధర్ కాజా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్టేషన్‌కు తరలించారు. శుక్రవారం కారును మోటారు వెహికల్ ఇన్స్‌స్పెక్టర్ తనిఖీ చేస్తుండగా కారు డిక్కీలో 24 బడ్వయిజర్ బీర్లు కనిపించాయి. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని నితీష్, భానుప్రకాష్‌పై కేసు నమోదు చేశారు.

సారాతో ముగ్గురి అరెస్ట్

శంఖవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం మండపం సెంటర్‌లో హైవేపై గురువారం రాత్రి ఆటోలో తరలిస్తున్న 72 లీటర్ల సారాను తరలిస్తున్న ముగ్గురు నిందితులను అన్నవరం పోలీసులు అరెస్ట్ చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. నిందితులను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్టు పేర్కొన్నారు.

అమలాపురం

అమరవీరుల సేవలు మరువలేనివి

మలికిపురం,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సేవలు మరువరానివని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మలికిపురం సెంటర్‌లో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం



ముమ్మిడివరం: బాధితులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతీ ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. అన్నంపల్లి, చింతలపల్లిలంక, కొమానపల్లి గ్రామాల్లో బాధితులకు సాయాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూఅధికారుల బృందం నష్టాలను అంచనా వేస్తున్నారని, త్వరలోనే అందరినీ ఆదుకోవడం జరుగుతుందన్నారు.ఈసందర్భంగా గ్రామంలో మత్స్యకారులకు 50కిలోల బియ్యం, కిలో నూనె, కిలో పప్పు, ఉల్లిపాయలు, ఆలుగడ్డలు, పంచదార అందిస్తామని, ఇతరులకు 25కిలోల బియ్యం, నిత్యావసరాలు, వస్తువులు అందిస్తామన్నారు. గ్రామంలో 420మందికి నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. కొమానపలిలో రూ.3వేలు వంతున బాధిత కుటుంబానికి నగదు సాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, అర్ధాని శ్రీనివాసరావు, పొద్దోకు నారాయణరావు, తాడి నరసింహారావు, కోలా గంగాభవానీ, గుద్దటి జమ్మి, చిక్కాల అంజిబాబు, దంగేటి శ్రీనివాస్, పళ్ల రాజబాబు, దాట్ల బాబు, దూడల స్వామినాయుడు, గోదశి గణేష్, గుద్దటి వీరాస్వామినాయుడు,చింతలపూడి కొండబాబు, రేకాడి రాంబాబు, కుంచనపల్లి వెంకన్నబాబు, కుంచనపల్లి నారాయణ పాల్గొన్నారు.

ఎల్లవేళలా అండగా ప్రభుత్వం

మామిడికుదురు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. తుఫాన్ బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని నష్టాలను నివారించగలిగామన్నారు.



మామిడికుదురు: బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే గిడ్డి

జిల్లాలో తుఫాన్ బాధిత కుటుంబాలు గుర్తించి వారికి ఆర్థికసాయంతో పాటు 25కిలోల బియ్యం, కిలో చొప్పున పంచదార, కందిపప్పు, ఉల్లి, ఆలుగడ్డలు, లీటరు వంటనూనె అందిస్తున్నట్టు తెలిపారు. ఆర్థికసాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.3వేలు, ఒంటరి వ్యక్తులకు రూ.వెయ్యి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ వరి, ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం బృందాల ద్వారా అంచనాలను రూపొందిస్తుందని, దెబ్బతిన్న గృహాలు లెక్కించి నష్ట పరిహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామాన రాంబాబు, ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ సునీల్‌కుమార్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోటనరింగ్ కమిటీ సభ్యుడు జాలెం శ్రీనివాసరాజా, మెండా ఆదినారాయణ, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం పంపిణీ

పి.గన్నవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను అధికారులు సమన్వయంగా సమర్థవంతంగా ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. పి.గన్నవరంలో శుక్రవారం 25కిలోల బియ్యం, నిత్యావసరాలు, నగదును ఆర్డీవో పి.శ్రీకర్‌తో కలిసి తుఫాన్ బాధితులకు ఎమ్మెల్యే అందించారు. మండలంలో 803కుటుంబాలకు రూ.19.93లక్షలు అందిస్తున్నామని చెప్పారు. మండలప్రత్యేక అధికారి హౌసింగ్ పీడీ ఎంవీ నరసింహారావు, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీడీవో ఎం.మల్లికార్జునరావు, ఎంఎస్‌వో ఎండీ ఇస్మాయిల్, సొసైటీ చైర్మన్ సాధనాల శ్రీవెంకటసత్య నారాయణ, పెద్దిరాజు, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు, చిల్లా ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ వసతులు

అంబాజీపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థుకు కూటమి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. తొండవరంలో రూ.67లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థి తయారుచేసిన రాకెట ప్రదర్శనను, విద్యార్థులు రూపొందించిన రోబోట్ నమూనాను ఎమ్మెల్యే తిలకించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఏపీ ఇండస్ట్రియల్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, ఎస్ఎంసీ చైర్మన్ పేరాబత్తుల వెంకటసుబ్బారావు, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, నాయకులు దాసరి వీర వెంకట సత్యనారాయణ, నాగాబత్తుల సుబ్బారావు, షైపాల తాతాజీ, పేరాబత్తుల సుబ్బరాజు, హెచ్ఎం కేశవచార్యులు పాల్గొన్నారు.



హైస్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తుఫాన్ బాధిత కుటుంబాలను, రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. తొండవరంలో తుఫాన్ బాధిత కుటుంబాలకు రూ.3వేల నగదు, 25కిలోల బియ్యం, నిత్యావసరాలను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. తహశీల్దారు చినబాబు, సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవం



పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైఖ్యత దినోత్సవంలో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను పురస్కరించుకుని ఎస్పీ రాహుల్ మీనా ఏక్తా రన్‌ను శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. దేశ సమైక్యత, అఖండత కోసం కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఏక్తా రన్ నిర్వహించినట్టు ఎస్పీ పేర్కొన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాన్ని ప్రజల్లో పెంపొందించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. దేశ భద్రత, సమైక్యతలో పౌరులందరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, సర్దార్ పటేల్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడానికి మనమంతా కృషి చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రసాద్, ఏఆర్‌డీఎస్పీ సుబ్బరాజు, ఎస్బీ సీఐ పుల్లారావు, డీసీఆర్బీ సీఐ మురళీకృష్ణ, ఏఆర్ఆర్ఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ వర్ధంతి

అమలాపురం టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని శుక్రవారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అమలాపురం హైస్కూలు సెంటర్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి ఆమెతో పాటు పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. గరీబీ హటావో నినాదంతో దేశ వ్యాప్తంగా ఇందిరాగాంధీ సంచలనం సృష్టించారన్నారు. బ్యాంకుల జాతీయకరణతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి దేశ ఖ్యాతిని ప్రపంచంలో వ్యాపింప చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు, మహబూబ్ షకీల, ఏలేశ్వరపు రాధాకృష్ణ, పేరి శర్మ, జోగి అర్జునరావు, సుగ్గు ప్రసాద్, ఈతకోట సోమరాజు, ముషిణి లక్ష్మణ్, అయితాబత్తుల కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 41వ వర్ధంతిని ముమ్మిడివరంలో శుక్రవారం నిర్వహించారు. పోలమ్మ చెరువుగట్టున ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పి.ఉదయభాస్కరవర్మ, పాలెపు ధర్మారావు, వడ్డి నాగేశ్వరరావు, దివి వెంకన్నబాబు, మల్లాడి గోపి, బాలకృష్ణ పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని మామిడికుదురులో శుక్రవారం నిర్వహించారు. స్థానిక బస్టాండు కూడలిలో గల ఆమె విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ, నీతిపూడి బాలసత్యనారాయణ, బత్తుల సురేష్‌బాబు, వాణరాశి దుర్గారావు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు కూటమి ప్రభుత్వం భరోసా



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తుఫాన్ బాధిత కుటుంబాలకు నిత్యావసరాలను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా దేవ మాట్లాడుతూ తుఫాన్ బాధితులకు నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయం కూటమి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, వైస్ ఎంపీపీలు యింటిపల్లి ఆనందరాజు, పొలమూరి శ్యామ్‌బాబు, సర్పంచ్ రేవు జ్యోతి, పినిశెట్టి బుజ్జి, ఉపసర్పంచ్ పామర్తి రమణ, అడబాల విజయ్, దారపురెడ్డి బాబ్జి, మోకా పార్వతి, మానుకొండ దుర్గాప్రసాద్, కడలి వెంకటరమణారావు, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, ఎంఈవో ఎం.మనోహరం, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

'టీచర్లకు బోధనేతర పనులు అప్పగించవద్దు'



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ముమ్మిడివరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని, తాము ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం వంటి పనులు మాత్రమే చేస్తామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘ నాయకులంతా ఎంఈవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాన్ని ఎంఈవోకు అందించారు. బోధనేతర పనుల వల్ల బోధనా సమయం హరించుకుపోతుందని, ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి తగ్గిపోతుందని వారు పేర్కొన్నారు. అనవసరమైన గూగుల్ షీట్లు నింపడం, జీఎస్టీ 2.0 వంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలు ఇకపై తాము చేపట్టబోమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మునేశ్వరరావు, యూటీఎఫ్ శీలారపు శ్రీనివాసరావు, జె.భైరవస్వామి, కె.ఉమామహేశ్వరరావు, వీవీ సత్యనారాయణ, జె.శ్రీధర్, ఎం.లక్ష్మణకుమార్, ఏపీ శ్రీనివాస్, పి.హిమబిందు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

కాట్రేనికోన, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాను తీరం దాటి మూడు రోజులైనప్పటికీ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంలో ట్రాన్స్‌కో అధికారులు విఫలమయ్యారని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శుక్రవారం విద్యుత్ సబ్ స్టేషన్‌లో అధికారులను నిలదీశారు. ఒక మోస్తరు గాలికి పడిపోయిన పోల్స్‌ను నిలబెట్టి సరఫరాను పునరుద్ధరించడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు. అవసరమైన సామగ్రిని, సిబ్బందిని ప్రభుత్వం ఏర్పాటుచేసినా సరఫరా పునరుద్ధరించడంలో ఎందుకు విఫలమయ్యారని నిలదీశారు. సిబ్బంది వెళ్లిపోయారని ఏఈ శ్రీనివాస్ అన్నారు. ఈ విషయం తనకు చెబితే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేవాడినని ఎమ్మెల్యే అన్నారు. పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు శుక్రవారం పెద్ద ఎత్తున సబ్ స్టేషన్‌కు చేరుకున్నారు.

బాధితులకు అండగా ఉంటాం

అంతర్వేది, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితులు, తుఫాన్లు, వరదల సమయంలో ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మొంథా తుఫాన్ బాధిత కుటుంబాలకు కేశవదాసుపాలెం తుఫాన్ షెల్టర్ భవనం వద్ద బియ్యాన్ని పంపిణీ చేశారు. మత్స్యకార కుటుంబాలకు 50కిలోలు, ఇతరులకు 25కిలోలు చొప్పున అందించారు. తుఫాన్ బాధితులు, మత్స్యకార కుటుంబాలకు రూ.3వేలు నగదు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, ముప్పర్తి నాని, యెనుముల సింహాచలం, సర్పంచ్ సరోజ, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఏవో రాకేశ్, ఉండపల్లి అంజి, పోతురాజు కృష్ణ, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

యానాం,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయి యానాం బాధితులను పుదుచ్చేరి ప్రభుత్వం ఆదుకోవాలని గవర్నర్ కైలాస్‌నాథన్‌ను ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. శుక్రవారం పుదుచ్చేరిలోని రాజ్‌నివాస్‌కు వెళ్లి గవర్నర్‌కు కలిశారు. యానానికి సంబంధించిన అనేక సమస్యలను మల్లాడి వివరించారు. అనంతరం యానాం తుఫాన్ బాధితులను ఆదుకోవాలని కోరుతూ మల్లాడి గవర్నర్‌కు వినతిపత్రం అందించారు. ప్రతి రేషన్ కార్డుదారునికి రూ.5వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో ఏర్పడిని తుఫాన్ నష్టాన్ని వివరించారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న సత్తిబాబు

అమలాపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈదరపల్లి వంతెన వద్ద, అమలాపురం ఆర్టీసీ బస్టాండు సెంటర్, ఎస్టీయూ కార్యాలయాలతో పాటు పలుచోట్ల ఏఐటీయూసీ పతాకాలను ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొప్పల సత్తిబాబు ఆవిష్కరించారు. కార్మిక సంఘాలను ఏకీకృతంచేసి ఏఐటీయూసీని 1920లో ఏర్పాటుచేసినట్టు సత్తిబాబు వివరించారు. అప్పటి నుంచి దశలవారీగా ఏఐటీయూసీ సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, రాష్ట్ర ప్రతినిధి నాగిరెడ్డి శివప్రసాద్, వివిధ యూనియన్‌ల నాయకులు ఊటాల వెంకటేష్, కురచ నాగేశ్వరరావు, చొల్లంగి సాయిబాబు, బొలిశెట్టి గౌరీశంకర్, మట్టపర్తి నారాయణ, బొక్కా నాని, కాళ్ల భీమరాజు, కామిరెడ్డి చంద్రరావు, గూడాల వెంకటరమణ, నక్కా బాలకృష్ణ, హేమవరపు సత్యనారాయణ, బాలనాగు గుప్త, ఏకాంబరం పాల్గొన్నారు.

నవంబరు 12న రన్ ఫర్ యూనిటీ



రన్ ఫర్ యూనిటీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ హరీష్‌బాలయోగి, బీజేపీ నాయకులు

అమలాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఏక్తా దివస్‌లో భాగంగా అమలాపురంలో నవంబరు 12వ తేదీ ఉదయం 9 గంటలకు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి వెల్లడించారు. ఐక్యతా స్ఫూర్తి చాటాలని పిలుపునిచ్చారు. శుక్రవారం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఐక్యతతో దేశ, రాష్ట్రాభివృద్ధికి సూచిక వంటివారన్నారు. ఈసందర్భంగా పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి రూ.5లక్షల విరాళం

మలికిపురం,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి):మేడిచర్లపాలెంలో నిర్మించనున్న శివాలయానికి స్టోన్‌క్రాఫ్ట్ గ్రూపు అధినేత చిలుకూరి కీర్తి రూ.5లక్షలు విరాళం అందజేశారు. విరాళాన్ని దేవదేవ విశ్వేశ్వర ట్రస్టు అధ్యక్షుడు మేళం మూర్తికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీకి ఉద్యోగ విరమణ సత్కారం

అమలాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన బళ్ల వీరవెంకటసత్యనారాయణను ఎస్పీ రాహుల్ మీనా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెచ్‌సీగా సత్యనారాయణ చేసిన సేవలను ప్రశంసించారు. 33ఏళ్ల పాటు పోలీసుశాఖలో విలువైన సేవలు అందించిన సత్యనారాయణను ప్రతీ ఉద్యోగి స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదనపు ఎస్పీ ఈవీఆర్‌పీబీ ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు, ఏఆర్ ఆర్ఐ కోటేశ్వరరావు, ఎస్బీ ఇనస్పెక్టర్ పుల్లారావు, మురళీకృష్ణ, తమ్మినాయుడుతో పాటు ఉద్యోగ విరమణ చేసిన సత్యనారాయణ బంధుమిత్రులు కార్యక్రమంలో పాల్గొని ఘనంగా ఆయనకు వీడ్కోలు పలికారు.


'టెట్‌పై ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలి'

అమలాపురం టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ పాస్ అవ్వాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని కోరుతూ ఫ్యాప్టో జిల్లాశాఖ చైర్మన్ ఎంటీవీఎస్ సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి దొరబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఐదేళ్ల పైబడి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు టెస్ట్ పాసవ్వాలన్న అంశంపై రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్‌సరిదే సత్యపల్లంరాజు, పెంకే వెంకటేశ్వరరావు,జిల్లా ఆర్థిక కార్యదర్శి కె.రామచంద్రం, ఫ్యాప్టో సభ్యులు సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్ విడుదల

అయినవిల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనోటిఫికేషన్ వెలువడిన 20రోజుల్లోపు ఆసక్తి గలవారు దేవస్థానంలోని కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని ఆలయ సహాయ కమిషనర్ ఓ ప్రకటనలో కోరారు. జీవోఆర్టీ నంబరు 1321 అనుసరించి ఈ ఉత్తర్వులు శుక్రవారం వెలువడినట్టు ఆయన తెలిపారు.

ఒకే కాన్పులో రెండు పెయ్యదూడలు



అమలాపురం టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అమలాపురం గొల్లగూడెం బైపాస్ రోడ్డులోని శ్రీకృష్ణుని మందిరం వెనుక నివాసం ఉంటున్న వంటపాటి శ్రీనివాసరావుకు చెందిన ఆవు శుక్రవారం రెండు పెయ్య దూడలకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగానే ఉన్నాయి.

వల్లభాయ్ పటేల్ జయంతి

అయినవిల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వల్లభాయ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో పెచ్చెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ దేశానికి మొదటి ఉపప్రధాని అని, హోంమంత్రిగా కూడా దేశానికి సేవలందించారని కొనియాడారు. మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేరేడుమిల్లి సత్యనారాయణ, సీనియర్‌ఉపాధ్యాయులు అరవ శ్రీనివాసరావు,తోపెల్ల శ్రీనివాసరావు, జి.సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే



బాధితులకు సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. కొమరగిరిపట్నం పంచాయతీ ఎస్.రామేశ్వరంలో శుక్రవారం తుఫాన్ బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం, బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఓడలరేవు, సామంతకుర్రు పల్లిపాలెం, బోడసకుర్రు గ్రామాల్లో బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, డీసీ చైర్మన్ దాట్ల గోపీరాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ వీవీఎల్ నరసింహం,నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు డి.రాంబాబు, కర్నీడి మూర్తి, సర్పంచ్‌లు రొక్కల విజయలక్ష్మి, రాకాపు విజయలక్ష్మి, మల్లాడి మంగాయమ్మ, కె.వెంకటరమణ పాల్గొన్నారు.

'బాధితులను ఆదుకోవడం చంద్రబాబుకే సాధ్యం'

ఉప్పలగుప్తం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులను తక్షణం ఆదుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. తీరప్రాంత గ్రామం ఎస్.యానాంలో శుక్రవారం ఆయనతో పాటు జేసీ నిశాంతి మత్స్యకారులకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగిరాజేశ్వరీరాజా, ఆక్వా స్టేట్ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, మత్స్యకార అభివృద్ధి సంస్థ డైరెక్టర్ లంకే భీమరాజు, వాటర్ డీసీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, స్టేట్ సివిల్ సప్లై ఆఫీసర్ రోణంకి గోవిందరాజులు, డీఎస్వో అడాపా ఉదయభాస్కర్, తహసీల్దార్ వాసా దివాకర్, డీటీ జి.లలిత, కూటమి నాయకులు పినిశెట్టి నరసింహారావు, పలచోళ్ళ బుజ్జి, పలచోళ్ళ గోపి, ఉలిశెట్టి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

అంబాజీపేట, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): అమరులైన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సమాజ పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఎస్ఐ కె.చిరంజీవి, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులర్పిస్తూ ర్యాలీ

అమలాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ నివాళులర్పిస్తూ నిర్వహించిన ర్యాలీలో ఎస్పీ రాహుల్ మీనా, అదనపు ఎస్పీ ఏవీఆర్పీబీ ప్రసాద్, స్పెషల్ బ్రాంచి సీఐ పుల్లారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా పరిగణించాలి: కామన

ముమ్మిడివరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నష్టాన్ని జాతీయ విపత్తుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ముమ్మిడివరం మండలంలో తుఫాన్ వల్ల నేలనంటిన వరిచేలను శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు సడలించి రంగు మారిన, విరిగిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు చేయాలన్నారు. పి.ఉదయభాస్కరవర్మ, పాలెపు ధర్మారావు, వడ్డి నాగేశ్వరరావు, దివి వెంకన్నబాబు పాల్గొన్నారు.

ఐక్యతను పెంచే కార్తీక వనసమారాధనలు

పి.గన్నవరం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు గ్రామాల్లో ఐక్యతను చాటుతాయని బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతలక్ష్మి అన్నారు. ముంగండ ముత్యాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం అంబటి సత్యనారాయణ(సత్యంకాపు), బ్రహ్మయ్యల ఆశీస్సులతో ఏర్పాటుచేసిన కార్తీక వనసమారాధనలో ఆమె మాట్లాడారు. తొలుత జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఇండస్ట్రియల్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, నాయకులు చిల్లా జగదీశ్వరి, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, కోటేశ్వర రావు దంపతులు, మాజీ సర్పంచ్ సుంకర సత్యవేణి, పెచ్చెట్టి వెర్రియ్య, నాయకులతో కలిసి ఆమె ఉసిరి చెట్టువద్ద పూజలు నిర్వహించారు.

మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు మృతి



పి.గన్నవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మాజీ ఎంపీపీ పిల్లి శ్రీనివాసరావు(66) అనారోగ్యంతో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘకాలం సేవలందించారు. నియోజకవర్గ, మండల స్థాయిలో వివిధ హోదాలో పార్టీకి సేవలందించారు. 2021-06 వరకు ఎంపీపీగా పనిచేసి మండలంలో మంచి గుర్తింపు పొందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఆయన వైసీపీలో ఉన్నారు. వారం రోజులుగా ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కూటమి నాయకులు, వివిధ పార్టీల నేతలు పరామర్శించారు. శ్రీనివాసరావు భౌతికగాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుండె వ్యాధితో బాధపడుతున్న యువతికి ఆర్థిక సాయం

పి.గన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ముంగండలో నిరుపేద కుటుంబానికి చెందిన విత్తనాల పూజిత గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. ఆపరేషన్‌కు రూ.2.40లక్షలు అవసరం కాగా, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సీఎం సహాయనిధి నుంచి రూ.1.20లక్షలు మంజూరు చేయించారు. శుక్రవారం అబ్దుల్ కలామ్‌చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరుమిల్లి రాజేష్, లింగోలు పెద్దబ్బులు, పిల్లి శేఖర్‌తో పాటు పలువురు దాతలు అందించిన రూ.25వేలను, ముంగండ మాజీ సర్పంచ్ నేలపూడి దుర్గారావు ఆధ్వర్యంలో సేకరించిన రూ.25వేలు మొత్తం రూ.50వేలను చైర్మన్ బీమాల వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పూజితకు అందించారు.

శ్రీకామాక్షీ పీఠంలో సందడి

అమలాపురం టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీకామాక్షీ పీఠంలో కార్తీక శుక్రవారం మహిళలు దీపాల పూజలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించడంతో కామాక్షీ పీఠంలో సందడి నెలకొంది.

4న అంతర్వేదిలో మహాశాంతి హోమం

అంతర్వేది, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎటువంటి నష్టం వాటిల్లకుండా మొంథా తుఫాన్ అంతర్వేది తీరం మీదుగా తీరం దాటింది. నష్టం జరగకుండా చేయగలిగే ఆదిదేవుడు లక్ష్మీనరసింహస్వామి అని, ఆ స్వామి కరుణా కటాక్షాలతో మాత్రమే సాధ్యమైందని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌తెలిపారు. 4న మహాశాంతి హోమం నిర్వహిస్తామన్నారు.


కేశవరంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ


ఆలమూరులో సాయం పంపిణీ చేస్తున్న నాయకులు

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

● సాయం పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు
● మండపేట నియోజకవర్గంలో రూ.133 కోట్ల పంట నష్టం


మండపేట: వై.సీతానగరంలో ప్రభుత్వ సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల


ఆత్రేయపురంలో తుఫాన్ నిర్వాసితులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు


కోటిపల్లిలో మత్స్యకారులకు నిత్యావసరాలు అందిస్తున్న వాసంశెట్టి సత్యం

మండపేట, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంభవించిన మొంథా తుఫాన్‌ను ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వర రావు అన్నారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఆయన చెప్పారు. మా ప్రభుత్వం చేతల ప్రభుత్వమని ఆయన చెప్పారు. మండలంలోని వై.సీతానగరంలో శుక్రవారం తుఫాన్ కారణంగా నిరాశ్రయు లైన 18 కుటుంబాలకు ఎమ్మెల్యేవేగుళ్ల ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంను అందజేశారు. 14 కుటుంబాలకు రూ.1000 వంతున, నాలుగు కుటుంబాలకు రూ.3వేలు వంతున సాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి విజయలక్ష్మి, గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ ఎస్.వీర్రెడ్డి, ఎంపీటీసీ అడ్డాల శ్రీదేవి, మాజీ ఎంపీటీసీ పెన్మెత్స వెంకటవర్మ, మేడిద భూషణం, నక్కా జనార్దన, పర్వతిన వీర్రాజు, కూటమినేతలు ఉన్నారు.

పంటపొలాలను పరిశీలించిన ఏడీ

మొంథా తుఫాన్ కారణంగా మండపేట నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు చేసిన రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆలమూరు వ్యవసాయ శాఖ ఏడీ సీహెచ్‌కేవీ చౌదరి చెప్పారు నియోజకవర్గంలో పంటనష్టం రూ.133 కోట్లమేర ఉంటుందని అంచనా వేశామని ఆయన చెప్పారు. మండలంలోని కేశవరంలో ఆయన స్థానిక మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకర్‌తో కలిసి దెబ్బతిన్న పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దెబ్బతిన్న పంటను వ్యవసాయశాఖ సర్వేచేస్తుందని ఆయన చెప్పారు. మండపేట నియోజకవర్గ పరిధిలో 80శాతం మేర సర్వే పూర్తయిందని ఆయన చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం 47,732 ఎకరాల్లో వరిసాగు చేయగా ప్రాథమిక అంచనా ప్రకారం 37,749 ఎకరాల్లో వరి పంటకు తుఫాన్‌వల్ల తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టం రూ.133కోట్ల మేర వాటిల్లిం దన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు ప్రభుత్వం తొలుత రూ.10వేలు వంతున సాయం అందిస్తుందన్నారు. పంటల బీమా ద్వారా రైతులకు సాయం అందుతుందన్నారు. ప్రస్తుత ం తుఫాన్ తగ్గటంవల్ల వరిపంటకు మాగుడు తెగులు వచ్చే ప్రమాదం ఉందన్నారు ప్రస్తుతం సర్వేచే సిన అనంతరం పంటకోత ప్రయోగం చేసిన తర్వాత వరి దిగుబడిలో నష్టం వాటిల్లిందనే విషయం వెల్లడవుతుందని ఆయన చెప్పారు. కేశవరంలో పంటపొలాలను పరిశీలించిన వారిలో వ్యవసాయశాఖ ఏవో ప్రభాకర్‌తోపాటు, సహకార సంఘాధ్యక్షుడు ఉండమట్ల శ్రీనువాస్, మండల టీడీపీ అధ్యక్షుడు కర్రి తాతారావు పోతురాజు ఆలయకమిటీ చైర్మన్ అళ్లరాజు ఉన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా ఇబ్బందులకుగురై నష్టపోయిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటూ వారిని కూటమి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. తుఫాను కారణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసి పునరావాస కేంద్రాలలోఉన్న వారికి సీఎం చంద్రబాబు ప్రకటించిన నగదు, నిత్యావసర సరుకులను ఆయన శుక్రవారం మండలంలోని నేలటూరు గ్రామంలో అందజేశారు. గ్రామానికి మొత్తం 13 మందికిగాను 9మందికి రూ.1000 చొప్పున, 4 కుటుంబాలకు రూ.3వేలు చొప్పున పంపిణీ చేయడంతోపాటు ఒక్కొక్క కుటుంబానికి 25కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే వేగుళ్ల అందజేశారు. తహసీల్దార్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో 386 కుటుబాలకు రూ.7లక్షలు63వేలు నగదు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీ డీవో భానూజీరావు, ఎంఎస్‌వో పద్మ, వీఆర్‌వో రాయుడు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఆర్.సోమేష్, కడలి రాజు, వల్లూరి శ్రీనివాసచౌదరి, జనసేన అధ్యక్షుడు నక్కా జనార్ధన్ పాల్గొన్నారు.

తుఫాన్ ఆర్థికసాయం పంపిణీ

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంవల్ల ఇబ్బందులు పడిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయాన్ని శుక్రవారం ఆలమూరులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆలమూరులో ఫిషర్ మెన్ సొసైటీకి చెందిన 85మందికి 50కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందించారు. తుఫాన్ సమయంలో పునరావాస కేంద్రాలలో ఉన్న వారికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా కుటుంబానికి రూ.3వేలు, ఒకరు ఉన్నవారికి రూ.1000 చొప్పున 69మందికి పంపిణీ చేశారు. తహసీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఎ.రాజు, నాయకులు ఈదల సత్తిబాబు, నల్లబాబు, రాంబాబు, చల్లా బాబీ, సాలి సత్యనారాయణ, మానేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందజేత

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం తహశీల్దారు కార్యాలయంవద్ద శుక్రవారం తుఫాన్ బాధితులకు ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు, ఆర్డీవో శ్రీకర్ బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న నిర్వాసితులు ఒక్కొక్క కుటుంబానికి రూ.1000 ఆర్థిక సాయం, 25కేజీల బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. అలాగే 76మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, సర్పంచ్ గెడ్డం సుధ, తహశీల్దారు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యావసర కిట్లు పంపిణీ

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన మత్స్యకార కుటుంబాలకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. తుఫాన్ ప్రభావం కారణంగా వేటకు వెళ్లకపోవడంతో భృతి కోల్పోయిన 270 మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరుకులు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పంపిణీ చేశారు.

బియ్యం, నిత్యావసరాల పంపిణీ

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తు సమయాలలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రామచంద్రపురం ఆర్డీవో అఖిల, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యంలు అన్నారు. శుక్రవారం దంగేరు, కోటిపల్లి గ్రామాల్లో తుఫాను బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధితులకు 25కిలోల బియ్యం, మత్స్యకారులకు, చేనేత కార్మికులకు 50కిలోల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీరామప్రసాద్, సర్పంచ్ పెమ్మాడి బేబి, స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, కూటమినాయకులు కర్రి చిట్టిబాబు, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, రేవు శ్రీను, గొడవర్తి రామకృష్ణ, చీకట్ల సోమేష్, జగతా వెంకటరమణ, కంచుమర్తి బాబూరావు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ సాయం పంపిణీ

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను పురస్కరించుకుని పునరావాస కేంద్రాలలో ఉన్న బాధితులకు రూ.3వేలు వంతున పరిహారం పంపిణీ చేశారు. 276 మత్స్యకార కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 50కేజీల బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, మిద్దే ఆదినారాయణ, ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, ముత్యాల బాబ్జి, ధరణాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాస్, గనిశెట్టి వీరేష్, పాలూరి సత్యానందం, యల్లమిల్లి జగన్మోహన్‌తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వల్లభాయ్ పటేల్

● జయంతి వేడుకల్లో నేతలు


మండపేటలో పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు


కొత్తపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు


రాయవరం: సోమేశ్వరంలో నివాళులర్పిస్తున్న దృశ్యం


రావులపాలెం డిగ్రీ కళాశాలలో..

మండపేట, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): భారతదేశ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలి ఉపప్రధానిగా, రక్షణమంత్రిగా పనిచేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేటితరాలకు స్ఫూర్తి ప్రదాత అని వక్తలు అన్నారు. పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం పటేల్ 150వ జయంతిని పురష్కరించుకుని ఆయన దేశానికి చేసిన సేవలను నేతలు కొనియాడారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంతకు ముందు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. బీజేపీ శ్రేణులు వి.రవీంద్రబాబు, మద్దుల సుబ్బారావు, కోనా సత్యనారాయణ పాల్గొన్నారు. ద్వారపూడిలో జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్లో పటేల్ 150 జయంతిని జరుపుకున్నారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం గ్రామంలో భారత మాజీ ఉప ప్రధాని ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్య చిరట్ల సుబ్బారావు, నరాల రాంబాబు, ఈరెళ్ల కృష్ణమూర్తి, గరగ రాంబాబు, నిమ్మకాయల సాయిరాం ప్రసాద్, అబ్బిరెడ్డి శాంతరాజు, బొబ్బా సూర్యప్రకాష్, శాకా మలేష్ , రాంబాల వెంకటేశ్వరరావు, శాకాధనుంజయపాల్గొన్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీపీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో పొలిటికల్ సైన్సు అధ్యాపకులు ఎస్.రాజేంద్రప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణకుమార్ జయంతిని నిర్వహించారు.

జాతీయ ఐక్యత దినోత్సవం

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులలో జాతీయ ఐక్యత, సమగ్రత, సామరస్య భావనను పెంపొందించేందుకు జాతీయ ఐక్యత దినోత్సవం నిర్వహిస్తామని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులుర్పించారు. అనంతరం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు టీసీహెచ్ పాపారావు, డాక్టర్ జి.శ్రీనివాసులు, డాక్టర్ కె.అంకమరావు, సాయికృష్ణ, నాగలక్ష్మి, నాగదీపిక, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

● డీఈవో సలీంభాష


వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న డీఈవో సలీం భాషా తదితరులు

ఆలమూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి 2025-26 విద్యాసంవత్సరంలో జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేలా ప్రతీ ఉపాధ్యాయుడు కృషిచేయాలని నూరుశాతం ఉత్తీర్ణతపై దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంభాష సూచించారు. ఆలమూరు మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం డీఈవో సలీంభాష ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆలమూరు జెడ్పీగరల్స్ హైస్కూల్, శ్రీసిద్దార్థ హైస్కూల్, శ్రీవిద్యాపబ్లిక్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో చర్చించారు. పదో తరగతి పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులతో ఆయన సబ్జెక్ట్ వారీగా రివ్యూ చేశారు. విద్యార్థులను వివిధ కేటగిరీలుగా విడదీసి ఆవిధంగా విద్యాబోధనచేసి ప్రతీవిద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులతో చర్చించారు. డీఈవో భాష వెంట బీసీఈబీ కార్యదర్శి హనుమంతరావు, ఆలమూరు ఎంఈవోలు బి.అప్పాజీ, నేదునూరి రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం : డీఈవో

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేసి ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు తెచ్చు కుని నేడు పదవీ విరమణ చేస్తున్న పొడ గట్లపల్లి వెంకటేశ్వరరావు విద్యావ్యవస్థలో చేసిన సేవలు ప్రశంసనీయం అని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.కె. సలీంబాషా అన్నారు. శుక్రవారం కె.గంగ వరం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన పొడగట్లపల్లి వెంకటేశ్వరావు పదవీ విరమణ సభ జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విశిష్ట అతిథిగా హాజరైన సత్యం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి మాట్లాడారు. అనంతరం వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. రామచంద్రపురం మార్కెట్‌కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, జనసేన మండల అధ్యక్షు డు చిర్రా రాజ్‌కుమార్, ఎంఈవో1 ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి అంజనేయులు, సొసైటీ చైర్మన్ నేమాని సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి జి.వి సుబ్రహ్మణ్యం, మండలం లోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుగొండ పేరును మార్చడంపై హర్షం

కె.గంగవరం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన వాసవీమాత పుట్టిన పెనుగొండ గ్రామం పేరును వాసవీ పెనుగొండగా మారు స్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై కోనసీమజిల్లా ఆర్యవైశ్యులు హర్షం ప్రకటించారు. సంఘం ఉపాధ్యక్షుడు మాటూరి వెంకటేశ్వరరావు(నాని), కె.గంగవరం మండల అధ్యక్షుడు చిన్ని రామప్రసాద్, నాళం సూరిబాబు, వెంకన్నబాబు, శ్రీను, రాము మాటూరి వాసు, తాటికొండ బాబు, నానాజీ, మోహన్, నాగేశ్వరరావు తదితరులు కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

● ఆలమూరులో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్

ఆలమూరు, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలవల్ల ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. ఆలమూరు మండలంలో శుక్రవారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. మండలంలో ఆయన పెదపళ్ల, ఆలమూరు, మోదుకూరు, గుమ్మిలేరు తదితర గ్రామాలలో పారిశుధ్యం నిర్వహణను స్వయంగా పరిశీలించి పలు సూచనలు అందించారు. తుఫాన్ అనంతరం రోడ్లు, పాఠశాల ఆవరణలు, పబ్లిక్ ప్రాంతాలలో ఎటువంటి చెత్తలేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా డ్రైన్లు సక్రమంగా నీరు పారే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని చెప్పారు.

రామచంద్రపురం పట్టణ బంద్‌ను విజయవంతం చేయండి

ద్రాక్షారామ, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడజిల్లాలో కలపాలని డిమాండ్‌చేస్తూ గత కొన్ని నెలలుగా అఖిలపక్ష జేఏసీ నేతృత్వంలో ప్రజా ఉద్యమాలు, నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రభుత్వం ఈ అంశంపై క్యాబినెట్ సమావేశం ఏర్పాటుచేసి తుది నిర్ణయం తీసుకునేదశలో ఉన్న సందర్భంలో రామచంద్రపురం పట్టణ చాంబర్స్ ఆఫ్ కామర్స్, వివిధ వర్తక, వాణిజ్య సంఘాలు నవంబరు6న స్వచ్ఛందంగా పట్టణ బంద్ చేపట్టాలని నిర్ణయించాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు చాంబర్స్ ఆఫ్ కామర్స్ నేతలను కలుసుకుని వారి నిర్ణయాన్ని అభినందించారు. నవంబరు 6న జరిగే పట్టణ బంద్‌ను అన్నివర్గాల ప్రజలు మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి

మండపేట, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): దేశ మాజీప్రధాని దివంగత నేత ఇందిరాగాంధీ 41వ వర్ధంతిని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు నేతృత్వంలో శుక్రవారం నిర్వహించారు. పట్టణంలో రాజారత్న సెంటరులోవున్న ఇందిరాగాంధీ విగ్రహానికి కామనతోపాటు కాంగ్రెస్ శ్రేణులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కొండా దుర్గారావు, ఉపాధ్యక్షుడు పాడిశెట్టి సత్యన్నా రాయణ, మగ్గం జాకబ్ రాజబాబు, కుచ్చుబాటీ, కొండ సత్తిబాబు, అప్పన దావిదు, ముసలయ్య సూరిబాబు, చిన్న పాల్గొన్నారు.

పామర్రులో 33 పనుల గుర్తింపు

కె.గంగవరం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో 2026-2027లో చేపట్టనున్న పనుల గుర్తింపు నిమిత్తం సభ నిర్వహించారు. ఈ సభలో 33 పనులు గుర్తించారు. ఈసందర్భంగా ఏపీఎం సురేంద్ర మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతీఒక్కరూ తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. గ్రామ కార్యదర్శి సీతారామయ్య, మరివాడ సూరి బాబు పాల్గొన్నారు.

నాగభూషణం మాస్టారు మృతి



రావులపాలెం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రావులపాలానికి చెందిన కుడుపూడి నాగభూషణం(83) మాస్టారు గురువారంరాత్రి వృద్ధాప్యం కారణంగా ఆయన ఇంటి వద్ద మృతి చెందారు. ఈయన రావులపాలెం మండలం వెదిరేశ్వరం జడ్పీ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసి 2000 లో ఉద్యోగ విరమణపొందారు. ఈయన కుమారుడు మెహర్‌చైతన్య గోపాలపురం బాలికల జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా కుమార్తెలు సత్యవేణి, భాను, హైదరాబాద్ లో స్థిరపడ్డారు. నాగభూషణం మాస్టారు మృతికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, శాసనమండలి డిప్యూటీ మాజీచైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండారుశ్రీనివాస్, ఎంపీపీ లక్ష్మివెంకట నాగదేవి, జడ్పీటీసీ శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళలచే రక్తదానం

కొత్తపేట,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్వామీ వివేకానంద యోగాశ్రమం నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం ఏరియా ఆసుపత్రిలో యోగా మహిళలచే రక్తదానం చేయించారు. రోగులకు రక్తం అవసరం కాగా ఎం.దుర్గాభవాని, కె.మాధవి, ఎల్.సునీత, సీహెచ్ దేవి, ఎం.అనిత, మాధవి, సునీతలు రక్తదానం చేసి ఆదుకున్నారు.

వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న డీసీఎంఎస్ చైర్మన్


చంద్రమౌళి దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న చైర్మన్

ఆత్రేయపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామిని శుక్రవారం ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత ఆలయ మర్యాదలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శి ంచుకుని వేదాశీర్వచనం అందుకున్నారు. ఆల య చైర్మన్ ముదునూరి వెంకట్రాజు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వివి ధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

ఆత్రేయపురం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అ ధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారి వ్రతాలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

విజయదుర్గాపీఠంలో లక్షబిల్వార్చన


పీఠంలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గాపీఠంలో శుక్రవారం భవానీశంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకదశ రుద్రాభిషేకం, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. కార్తీక శుద్ధదశమి పురస్కరించుకుని పీఠంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ, తులసిదళ అర్చన, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పుష్పార్చన, భవానీశంకరసమేత అష్టలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, విజయదుర్గా అమ్మవారికి లక్షకుంకుమార్చనలు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అర్చనలు, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన నిర్వహించారు. భక్తులకు కార్తీకమాసం విశిష్టతను పీఠాధిపతి గాడ్ వివరించారు. ఈకార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం ప్రతినిధులు జి.భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పెదపాటి సత్య కనకదుర్గ, బి.రమ, బుజ్జి, పీఆర్వో బాబి, వేదపండితుడు చీమలకొండ వీరావధాని, అర్చకుడు చక్రవర్తుల మాధవాచార్యులు, కె.శివ, అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్, భక్తులు పాల్గొన్నారు.

'మహిళా చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి'


సీఐను సత్కరిస్తున్న మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఆలమూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని మహిళా చట్టాలను మహిళలు సద్వినియోగం చేసుకుని రక్షణ పొందాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ అన్నారు. ఆలమూరులో నారీ సాక్ష్యం మహిళావెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్త్రీల హక్కులు, భద్రత, యువత మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు శుక్రవారం ఆలమూరు కాపు కళ్యాణమండలంలో నిర్వహించారు. ఈ సదస్సులకు రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, కాపు సంఘం నాయకుడు చల్లా ప్రభాకరరావుతోపాటు పలువురు నాయకులు, న్యాయవాదులు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. మహిళా చట్టాలపై పలువురు వివరించారు. ఈసందర్భంగా సీఐ విద్యాసాగర్, కాపు సంఘం నాయకులు చల్లా ప్రభాకరరావులను ఘనంగా సత్కరించారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

● ఎమ్మెల్యే సత్యానందరావు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

ఆత్రేయపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం ఆత్రేయపురం వెలుగు కార్యాలయంలో ఎంఎస్ఎంఈ క్యాంపైన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ జిల్లా నోడల్ అధికారి సాయి జయచంద్రగాంధీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు ఆర్డీవో శ్రీకర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ వర్మ, బ్యాంక్ నోడల్ అధికారి శ్రీనివాస్, నాబార్డు బ్యాంకు మేనేజర్ స్వామినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు, వ్యాపార వేత్తలకు అవగాహన కల్పించారు. చిన్నతరహా కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి చెందవచ్చునని వివరించారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా యూనిట్లకు రుణాలు అందించి చర్యలు చేపడుతున్నామన్నారు. వ్యాపారరంగంలో అభివృద్ధి చెందడంతోపాటు మరో 10 మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతిఒక్కరూ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యేతోపాటు జిల్లా అధికారుల బృందం వర్క్‌షాపులో అవగాహన కల్పించారు. రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు, వాడపల్లిదేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు,మండల టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, కాయల జగన్నాథం, జుజ్జవరపు హరిబాబు, కుదప కృష్ణమూర్తి పాల్గొన్నారు.

300 మంది టీడీపీలో చేరిక

ఆత్రేయపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభు త్వం అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసీపీ నుంచి టీడీపీ వైపు మొగ్గుచూపుతున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం ఆత్రేయపురం శివారు నరసన్నపేటకు చెందిన సుమారు 300 మంది రజకపేటకు చెందిన 10 కుటుంబాలు, క్షత్రియ వర్గానికి చెందిన 10 కుటుంబాలు వైసీపీకి రాజీనామాచేసి టీడీపీలో చేరారు. ఆత్రేయపురంలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు స్వగృహం వద్ద ఎమ్మెల్యే బండారు సమక్షంలో వారందరూ టీడీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే బండారు పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పేదప్రజల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.